క్లుప్తంగా

చండీ మహారుద్ర యాగం ప్రారంభం



మోతీనగర్: లోక కల్యాణార్థం, ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా జీవించడానికి యాగాలు, యజ్ఞాలు, హోమాలు తరచూ నిర్వహిస్తుంటామని భరద్వాజ శ్రీ విద్యాపీఠం వ్యవస్థాపకులు విష్ణుభట్ల లక్ష్మీనరసింహ శర్మ అన్నారు. శుక్రవారం మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎంసీహెచ్‌ఎస్, భరద్వాజ శ్రీ విద్యాపీఠం ఆధ్వర్యంలో లక్ష్మీ నారాయణ చండీ మహా రుద్ర యాగం ఘనంగా ప్రారంభమైంది. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రుత్విక్కరణములు, శ్రీ చక్రవర్ణ పూజ, అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు స్వయంగా రాపిడితో అగ్నిని పుట్టించారు. కార్యక్రమంలో హనుమంతరావు, అంజిరెడ్డి, బిజముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ అల్లాపూర్‌లో శుక్రవారం ఏఈ రంజిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినాయకరావుతో కలిసి పర్యటించారు. న్యూ అల్లాపూర్‌లో రూ.40 లక్షల వ్యయం, కేసీఆర్ నగర్‌లో రూ.16 లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. మిగిలిన పనులను కూడా పూర్తి చేస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: కైత్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగప్ప తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంజనేయ నగర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సఫ్దార్‌నగర్, రాజీవ్‌నగర్, కైత్లాపూర్ ఫ్లై ఓవర్, జనతానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.


గంగపుత్ర సంఘం అభివృద్ధికి కృషి



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: గంగపుత్ర సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం గంగపుత్ర సంఘం ప్రాంత ప్రజలు ఆయన నివాసంలో కలిసి అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచినీరు. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల తదితర సమస్యలను పరిష్కరించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో జనార్దన్, శివకుమార్, ముత్యాలు, భిక్షపతి, యాదగిరి, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన



కేపీహెచ్‌బీకాలనీ: విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకుల హక్కులు, భవిష్యత్తు భద్రతను మెరుగుపర్చాలని జేఎన్టీయూ కాంట్రాక్ట్ టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. జేఎన్టీయూహెచ్‌లో శుక్రవారం నిరసన తెలిపి వారు మాట్లాడారు. బేసిక్ వేతనం, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, 3 శాతం వార్షిక ఇంక్రిమెంట్ కలిగిన కొత్త పేమెంట్ స్కేల్ అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకున్న తర్వాతే కొత్త అధ్యాపక పోస్టుల నియామకాలు చేపట్టాలన్నారు. సమావేశంలో నవీన్‌కుమార్, దశరథం, రమేష్, కల్యాణి, భవాని, వెంకన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, అజయ్, కోటయ్య, రంజిత్ పాల్గొన్నారు.

అద్దె భవనం కష్టాలకు చెక్

అద్దె భవనంలో కొనసాగుతున్న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల పునర్ వ్యవస్థీకరణ విషయమై మూడు రోజుల క్రితం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ పనుల నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలతో పాటు వారికి అవసరమైన వసతులు, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కార్యకలాపాలు కొనసాగే విధంగా కార్యాలయాలకు కార్పొరేట్ హంగులు తీసుకురావడానికి ప్రభుత్వం నిర్ణయించింది. తొలి దశలో నగర శివారు ప్రాంతాల్లో నాలుగు రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణాలను చేపట్టేందుకు నిర్ణయించారు. అందులో కుత్బుల్లాపూర్ ఒకటి. - సుభాష్‌నగర్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- మొదటి నాలుగు కార్యాలయాల్లో కుత్బుల్లాపూర్ ఒకటి
- ఇరుకు గదుల్లో ఇబ్బందిపడుతున్న ఉద్యోగులు, క్రయవిక్రయదారులు



సూరారంలోని కుత్బుల్లాపూర్ రిజిస్ట్రార్ కార్యాలయం



క్రయవిక్రయదారులతో రద్దీగా ఉన్న కార్యాలయం

అధునాతన హంగులతో..

మొదటి దశలో నిర్మించనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కనీసం మూడు ఎకరాలు కేటాయించనుంది. అందులో 10 నుంచి 15 వేల చదరపు అడుగుల్లో అధునాతన హంగులతో కార్యాలయ భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయం, పార్కింగ్, ఇతర వసతులు, డిజైన్లు ఉండేలా భవనాలను నిర్మించనున్నారు.

సూరారంలో 2007లో ఏర్పాటు

గతంలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉండేది. ఇక్కడ స్థానికంగా క్రయవిక్రయాలు జరిగితే మేడ్చల్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాల్సి వచ్చేది. ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు జనాభా పెరగడంతో ప్రభుత్వం 2007లో సూరారంలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ప్రతిరోజు 100కు పైగా రిజిస్ట్రేషన్లు జరిగే ఈ కార్యాలయం నుంచి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా కనీసం సొంత భవనం లేకపోవడంతో సంవత్సరాలుగా అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు.

పార్కింగ్ సదుపాయం లేక..

నిత్యం 100కు పైగా రిజిస్ట్రేషన్ జరిగే ఈ కార్యాలయానికి క్రయవిక్రయదారులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారి తాకిడి పెద్ద సంఖ్యలో ఉంటుంది. కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సూరారం ప్రధాన చౌరస్తాను ఆనుకుని ఉండడంతో పార్కింగ్ సదుపాయం లేక కార్యాలయానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

ఇబ్బందులు తొలగినట్టే..



ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించనుండటంతో ఇబ్బందులు తొలగనున్నాయి. పార్కింగ్ సదుపాయం లేక ఇరుకైన గదులతో కొంత ఇబ్బందులు పడ్డాం. కార్యాలయానికి వచ్చే వారి పనులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. కొత్త భవన నిర్మాణం జరిగితే కార్యాలయంలో పని వేగవంతంతో పాటు కార్యాలయానికి వచ్చేవారికి సులభంగా ఉంటుంది. – అశోక్, సబ్ రిజిస్ట్రార్ అధికారి, కుత్బుల్లాపూర్

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు

సాక్షి,సిటీబ్యూరో: న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది నిరసన దీక్షలు నిర్వహించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ ఎదుట ఆమె చిత్రపటానికి సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ దీక్షల్లో విద్యాశాఖలో పని చేస్తున్న ఏపీవోలు, డీపీవోలు, సాంకేతిక నిపుణులు, కంప్యూటర్ సహాయకులు, భవిత కేంద్రాల్లోని ఉపాధ్యాయులు, రీసోర్సు పర్సన్లు పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, పీఈటీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ సహాయకులు తదితరులు సమ్మెలో పాల్గొన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని, పేస్కేల్ కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఇందులో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు జగదీశ్వర్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టు

సాక్షి,సిటీబ్యూరో: కూకట్‌పల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం ఉదయం 10:30 గంటలకు జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు మధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో సెలెక్టు కాబడిన 101 విద్యార్థులు ఈ టెస్టుకు తప్పనిసరి హాజరు కావాలని కోరారు. వారు హాజరయ్యే బాధ్యతను సంబంధిత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తీసుకోవాలని వారు సూచించారు. టెస్ట్ తర్వాత జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శుక్రవారం బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేశారు. – బాలానగర్

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకం

పీఏసీ చైర్మన్ గాంధీ



కేలండర్ ఆవిష్కరిస్తున్న గాంధీ, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కూకట్‌పల్లి మండల టీఎస్‌యూటీఎఫ్ 2025 కేలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంలో తమ వంతు బాధ్యతను నిర్వహించాలని కోరారు. నిరంతరం విద్యాభివృద్ధికి, సమాజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జయ సింహారెడ్డి, జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్, మండల అధ్యక్షులు విఠల్ రెడ్డి, మండల గౌరవ అధ్యక్షులు మస్తాన్‌వలి, మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలు మణి, బాలానగర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనంతయ్య, కన్వీనర్ రాజశేఖర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి



కేక్ కట్ చేసిన భైరెడ్డి, ఉమామహేశ్వరరావు, శిక్షణ పొందుతున్న మహిళలు

మోతీనగర్: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా స్వయం ఉపాధి పొందాలని సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎస్ఎన్ భైరెడ్డి అన్నారు. శుక్రవారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి గుంటపల్లి ఉమామహేశ్వరావు స్థానిక మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఒక బ్యాచ్‌ని ఎంపిక చేసి ఉచితంగా కుట్టు శిక్షణ నేర్పించిన అనంతరం వారికి కుట్టుమిషన్ సైతం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సునీత, సక్కుబాయి పాల్గొన్నారు.

సహకరించకపోతే బస్సులు రద్దు చేస్తాం

- ఆర్టీసీ డిపో అసిస్టెంట్ ఇన్‌చార్జి మల్లేష్



ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్‌లో వాహనాల అక్రమ పార్కింగ్



కాలనీ వాసులతో మాట్లాడుతున్న డిపో అధికారి

ఆల్విన్‌కాలనీ: బస్టాప్ స్థలంలో ఇతర వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల బస్సు డ్రైవర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కాలనీ వారు సహకరించకపోతే బస్సులను రద్దు చేస్తామని కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ ఇన్‌చార్జి మల్లేష్ అన్నారు. ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2 బస్టాప్ స్థలాన్ని శుక్రవారం పరిశీలించి కాలనీ వాసులతో మాట్లాడారు. బస్టాప్‌లో ఇతర వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల బస్సులు తిరిగి వెళ్లడానికి ఇబ్బందిగా ఉందన్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. వాహనాలను తీయకుండా బస్సు డ్రైవర్లపై దాడులకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల పార్కింగ్‌తో బస్సులు నిలిపే స్థలం లేక ప్రయాణికులను ఎక్కించుకునే పరిస్థితి లేదన్నారు. ఇకనైనా చివరి బస్టాప్‌లోని ఖాళీ స్థలంలో వాహనాలు, గుడారాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఎక్కడో నివసించే వారు ఇతర వాహనాలను కూడా తీసుకువచ్చి అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారని, నెలల కొద్దీ ఇక్కడే వదిలివేస్తున్నారని తెలిపారు. అలాంటి వాహనదారులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు ప్రణాళికలతో ముందుకెళ్లాలి



కార్యక్రమంలో మోటివేషన్ స్పీకర్ సుధీర్ సంద్ర, నిర్వాహకులు

మూసాపేట: పదవ తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ప్రణాళికలతో ముందుకెళ్లాలని ప్రముఖ మోటివేషన్ స్పీకర్ సుధీర్ సంద్ర అన్నారు. కూకట్‌పల్లిలోని ఎస్ఆర్‌సీ గార్డెన్‌లో శుక్రవారం భారత వికాస్ పరిషత్, తెలంగాణ గుర్తింపు పొందిన స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, కూకట్‌పల్లి మండలం, సీఎంఎస్ కళాశాల ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. 67 పాఠశాలలకు చెందిన 3 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల్లో ప్రథమ ర్యాంక్ సాధిస్తానని చదవాలని, పరీక్షలు కూడా అదే విధంగా రాయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా కూకట్‌పల్లి మండల చైర్మన్ రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు కమలాకర్, ప్రధాన కార్యదర్శి రవిబాబు, కోశాధికారి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు అనిల్, ప్రతినిధులు పంచోల శ్రీనివాస్, సుకృత్ కుమార్, బీఎస్ఎన్ మూర్తి, సుజన ప్రభ, సీఎంఎస్ విద్యాసంస్థల చైర్మన్ సీపీ కొంక చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పదవ తరగతి విద్యార్థులు

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం

జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఉపాధ్యాయులు, నాయకులు



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న బండి రమేష్



మూసాపేటలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో.. తూము వేణు, ఉపాధ్యాయులు

సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులు, నాయకులు అన్నారు. శుక్రవారం ఆమె జయంతి సందర్భంగా వివిధ పాఠశాలల్లో సావిత్రిబాయి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మహిళల అభ్యున్నతి కోసం ఆమె చేసిన కృషిని వివరించారు. ఆమె స్ఫూర్తిని నేటితరం కొనసాగించాలని సూచించారు. -కూకట్‌పల్లి జోన్‌బృందం



శంషీగూడ పాఠశాలలో నివాళులర్పించిన ఉపాధ్యాయులు, తెల్ల హరికృష్ణ



జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో .. హెచ్‌ఎం విజయ సింహ, బాలానగర్ మండల విద్యాధికారి హరిశ్చంద్ర